విశాలాంధ్ర
గోదావరి జిల్లా
కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ

పంట నష్టం జరిగిన రైతులను ఆదుకుంటాం

విశాలాంధ్ర - కరప : ఇటీవల కాలంలో కురిసిన వర్షాలకు వరి పంట అనేక చోట్ల దెబ్బతిని రైతులు ఆపదలో ఉన్నారని పంట నష్టం జరిగిన ప్రతి రైతును ఆదుకుంటామని మాజీ మంత్రి కురసాల కన్నబాబు పేర్కొన్నారు. నడకుదురు గ్రామంలో తడిసిపోయి మొలకెత్తిన ధాన్యం రాశులను, నేలకొరిగి నీట మునిగిన వరి పొలాలను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంట నష్టం జరిగిన ప్రతి రైతును ఆదుకుంటామని రైతులు అధైర్య పడద్దని కన్నబాబు తెలిపారు. వేములవాడ గ్రామంలో ఇన్‌చార్జి ఆర్డీవో జె. సీతారామారావు, తహసీల్దార్ పొన్నమండ శ్రీనివాసరావు, ఆర్ఐ మాచరావు, అగ్రికల్చర్ అధికారుల బృందంతో కలిసి తడిసిన ధాన్యం రాశులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏడిఏ బాబురావు, ఏఓ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

విశాలాంధ్ర - సామర్లకోట : గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు కల్లాల్లోనే ధాన్యం రాశులు ఉండిపోయాయని పూర్తిగా తడిసిపోయాయని, అయినా ప్రభుత్వం పట్టించుకోలేదని, రాష్ట్ర ప్రభుత్వం రైతుల విషయంలో పూర్తిగా విఫలమైందని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ధ్వజమెత్తారు. సామర్లకోట మండలం పెద్ద బ్రహ్మదేవంలో వర్షాల కారణంగా నష్టానికి గురైన పంటలను పరిశీలించి, రైతులతో ఎమ్మెల్యే మాట్లాడారు. నష్టాలతో రైతులు అల్లాడుతుండగా పట్టించుకునే నాధులే కరువయ్యారన్నారు. తక్షణమే తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రాజప్ప డిమాండ్ చేశారు. పొలాల్లోకి వెళ్లి తడిసిపోయిన ధాన్యాన్ని రాజప్ప పరిశీలించారు. రాజప్ప వెంట తెలుగుదేశం పార్టీ నాయకులు, రాష్ట్ర రైతు సంఘం నాయకుడు పాలకుర్తి శీను బాబు, కంటే జగదీష్ మోహన్, మండల తెలుగుదేశం పార్టీ ప్రెసిడెంట్ తోటకూర శ్రీనివాస్, అడబాల కుమారస్వామి, బదుగు శ్రీకాంత్, గుమ్మల రామకృష్ణ, కౌన్సిలర్ వాసు, తదితర నాయకులు ఉన్నారు.

ఉద్యోగ నోటిఫికేషన్లపై ఏపీపీఎస్సీ ప్రకటన హర్షణీయం

విశాలాంధ్ర - కొత్తపేట : త్వరలో 1000కు పైగా గ్రూప్-2 ఉద్యోగాలు భర్తీకి నోటిఫికేషన్ ఇస్తామని, ఏపీపీఎస్సీ ద్వారా రాబోయే మూడు నెలల్లో డిగ్రీ లెక్చరర్స్, పాలిటెక్నిక్ లెక్చరర్స్, ఇంటర్ లెక్చరర్స్ పోస్టులతో పాటు 20 రకాల ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేస్తామని, ఏపీపీఎస్సీ బోర్డ్ మెంబర్ పరిగే సుధీర్ ప్రకటన చేయడం హర్షణీయమని అంబేద్కర్ కోనసీమ జిల్లా నిరుద్యోగ జేఏసీ అధ్యక్షుడు భావన నరేష్ చంద్ర అన్నారు. ఇకపై ఏపీపీఎస్సీ, గ్రూప్-2 ఉద్యోగాలకు న్యాయపరమైన ఇబ్బందులు లేకుండా రిక్రూట్ మెంట్ ప్రక్రియ త్వరగా పూర్తి చేస్తామని ఏపీపీఎస్సీ బోర్డ్ మెంబర్ ప్రకటించడాన్ని స్వాగతించారు. ప్రభుత్వంలోని వివిధ డిపార్ట్మెంట్స్‌లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలకు నోటిఫికేషన్లు జారీ చేసి నిరుద్యోగులకు న్యాయం చేయాలని ఈ సందర్భంగా నరేష్ చంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి కృషి

విశాలాంధ్ర - జగ్గంపేట : నియోజకవర్గ కేంద్రమైన జగ్గంపేటలో కొన్ని ప్రాంతాల్లో ఉన్న డ్రైనేజీ, తదితర సమస్యల పరిష్కారానికి కృషి చేయడం జరుగుతుందని వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత ఒమ్మి రఘురామ్ అన్నారు. శెట్టిబలిజీపేట, తదితర ప్రాంతాల్లో చాలా కాలంగా డ్రైనేజీ సమస్యలు పరిష్కారం కాక ప్రజలు ఇబ్బందులు పడుతుండటంతో వాటిని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రఘురామ్ మాట్లాడుతూ చిన్నపాటి వర్షానికే రోడ్లు, డ్రెన్‌లు జలమయమవు తున్నాయని ఆ ప్రాంతాల్లోని ప్రజలు తెలియజేయడంతో పరిశీలించామని, పరిష్కార ప్రయత్నం చేస్తున్నామని తెలియజేసారు. ఊరిలోని డ్రైనేజీలు అన్నీ శెట్టిబలిజపేట మీదుగానే బయటకు వెళ్లాలని అందువలన ఈ పేటలోని ప్రజలు డ్రైనేజీ సమస్యతో చాలా ఇబ్బంది పడుతున్నారన్నారు. ఈ సమస్యను జ్యోతుల చంటిబాబు దృష్టికి తీసుకువెళ్లి అధికారుల ద్వారా పరిష్కరిస్తామన్నారు. ఈయన వెంట వైసీపీ నాయకులు నీలపల్లి అప్పారావు, కిలపర్తి వీరాబాబు తదితరులు ఉన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ రాసే విద్యార్థులకు ప్రత్యేక బోధనా తరగతులు

విశాలాంధ్ర - ఏలేశ్వరం : ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతూ ఇంటర్ మొదటి, రెండవ సంవత్సరం సప్లిమెంటరీ పరీక్షలు రాసే విద్యార్థులకు ప్రత్యేక బోధనా తరగతులను నిర్వహిస్తున్నట్లు ఏలేశ్వరం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్‌హెచ్ కుమారి ఒక ప్రకటన తెలిపారు. ఈ మేరకు ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇంటర్ మొదటి రెండో సంవత్సరం పరీక్షలు ఫెయిల్ అయిన విద్యార్థులు సప్లిమెంటరీ పరీక్షలు రాస్తున్న వారికి ఈ నెల 21వ తేదీ వరకు ఉదయం 8 గంటల నుండి 12.30 గంటల వరకు కళాశాలలో ప్రత్యేక బోధన తరగతులను నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు వినియోగించుకుని పరీక్షల్లో ఉత్తీర్ణవ్వాలని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో జి. అనిల్ కిరణ్, బి. రామకృష్ణ, ఎ. ప్రతాప్, రాజేంద్రప్రసాద్, ఎస్తేరు ఉన్నారు.

9 నుంచి వానపల్లి పల్లాలమ్మ జాతర ఉత్సవాలు

విశాలాంధ్ర - రావులపాలెం : కొత్తపేట మండలం వానపల్లిలో వేంచేసియున్న శ్రీ పల్లాలమ్మ అమ్మ వారి ఆలయంలో మే 9 నుంచి జూన్ 9 వరకూ జరిగే జాతర, తీర్థ మహోత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయని ప్రభుత్వ విప్, కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. రావులపాలెం మండలం గోపాలపురంలో తన స్వగృహం వద్ద జరిగిన కార్యక్రమంలో అమ్మవారి జాతర, తీర్థ మహోత్సవాల గోడ పత్రికలను దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ కామిశెట్టి అమ్మన్ననాయుడు, సభ్యులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ ఉత్సవాలకు అధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున పటిష్ట ఏర్పాట్లు చేయాలని ధర్మకర్తల మండలి సభ్యులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దాసరికి భారత రత్న ఇవ్వాలి

విశాలాంధ్ర - మండపేట : సినీ, రాజకీయ, పత్రికా రంగాల్లో విశేష సేవలందించిన దర్శకరత్న డాక్టర్ దాసరి నారాయణరావుకు భారత రత్న బిరుదు ప్రదానం చేయాలని డీఎన్ఆర్ ట్రస్ట్ భవన్ మేనేజింగ్ ట్రస్టీ కామన ప్రభాకరరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. దాసరి 76వ జయంతిని ఏడిదలోని డాక్టర్ దాసరి నారాయణ రావు భవన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం పాల్గొని దాసరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కామన మాట్లాడుతూ చిత్రసీమలో, రాజకీయ రంగంలో, పత్రికా రంగంలో ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా భారత ప్రభుత్వం ఆయనకు భారతరత్న బిరుదును ప్రదానం చేయాలని కోరారు. ఈ కార్య క్రమంలో ట్రస్టు సభ్యులు పాడిశెట్టి సత్యనారాయణ, గంధ్రోతుల రామచంద్రరావు, తాడి సత్యనారాయణ రెడ్డి, కాటూరి అమ్మినీడు చౌదరి తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రైతులను తక్షణమే ఆదుకోవాలని జనసేన నిరసన

విశాలాంధ్ర - రాజోలు : అకాల వర్షాలు వలన పంట నష్టపోయిన రైతులను తక్షణమే ప్రభుత్వం ఆదుకోవాలని రాజోలు నియోజకవర్గ జనసేన నాయకులు డిమాండ్ చేశారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు రాజోలు నియోజకవర్గంలో అకాల వర్షాల వల్ల దెబ్బతిన్న పంటలను జనసైనికులు పరిశీలించి, రైతుల సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గురువారం రైతుల తరపున ప్రభుత్వం మీద ఒత్తిడి తీసుకొచ్చే విధంగా రాజోలు గాంధీ బొమ్మల సెంటర్ వద్ద మహనీయుల విగ్రహాలకు పూల మాలలు వేసి అక్కడ నుండి జనసేన నాయకులు ర్యాలీగా వెళ్లి తహశీల్దారు కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రం రాజోలు తహశీల్దారు ముక్తేశ్వరరావుకు అందజేసారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ రాష్ట్ర, జిల్లా, నియోజక వర్గ నాయకులు, మండల, గ్రామ స్థాయి నాయకులు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, క్రియాశీలక సభ్యులు, క్రియా వాలంటీర్‌లు, జనసేన నాయకులు, జనసైనికులు, వీర మహిళలు పాల్గొన్నారు.

దివ్యాంగుల సమస్యలు పట్టించుకోని ప్రభుత్వం

విశాలాంధ్ర - కాకినాడ సిటీ : సాంబమూర్తి నగర్ విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ ఉపసంచాలకుల కార్యాలయం వద్ద దివ్యాంగుల సమస్యలపై దివ్యాంగుల జెఏసీ ఆధ్వర్యంలో జరుగుతున్న రిలే నిరాహారదీక్ష 15 రోజుకు చేరుకోవటంతో దీక్ష శిబిరానికి మాజీ మేయర్, కాకినాడ జిల్లా టీడీపీ మహిళా అధ్యక్షురాలు సుంకర పావని తిరుమల కుమార్ వెళ్లి సంఘీభావం తెలిపి దీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుంకర పావని మాట్లాడుతూ గత 15 రోజులుగా దివ్యాంగులు ఎండనక, వాననక నిరాహారదీక్ష చేస్తుంటే అధికారులుగానీ, ప్రజా ప్రతినిధులు గాని పట్టించు కోక పోవడం దురదృష్టకరం అన్నారు. గత తెలుగు దేశం ప్రభుత్వంలో చంద్ర బాబు నాయుడు దివ్యాంగులకు పెళ్లి కానుకగా లక్ష రూపాయలు ఇచ్చారని, జగన్మోహనరెడ్డి 2019 ఎన్నికలలో లక్ష యాభైవేలు దివ్యాంగులకు పెళ్లి కానుకగా ఇస్తానని హామీ ఇచ్చి ఇప్పటికి ఏ ఒక్క జంటకు ఇవ్వకపోవటం సిగ్గు చేటన్నారు. ఈ నిరాహారదీక్షలో దివ్యాంగుల జెఏసి సభ్యులు జి. కొండల రాయుడు, నాగేశ్వరరావు, నారం శ్రీనివాస్, కే మహాలక్ష్మి, పి. సత్యవతి, యూ. శ్రీను, జెఏసి సభ్యులు పాల్గొన్నారు.

కన్నబాబు కళ్లుగప్పి అవినీతి చక్రం తిప్పుతున్న చోటా నాయకుడు

విశాలాంధ్ర - కాకినాడ రూరల్ : కాలంతో పోటీపడి అభివృద్ధి చెందుతున్న నగరాల్లో కాకినాడ నగరం కూడా ముందు వరుసలో ఉంది. వ్యాపార వాణిజ్య రంగాలకు సంబంధించిన వివిధ సంస్థలు ఇక్కడ తమ కార్యకలాపాలు నిర్వహించుకోవడంతో కాకినాడలో భూమి ధరలకు గిరాకీ పెరిగింది. కాకినాడ నగరానికి చేరి ఉన్న గ్రామాల్లో కూడా భూమి ధరలకు రెక్కలు వచ్చాయి. దీంతో అక్రమార్కుల కన్ను ప్రభుత్వ స్థలాలపై పడింది. రాజకీయ పలుకుబడితో అధికార యంత్రాంగాన్ని చెప్పు చేతల్లో పెట్టుకుని ద్వితీయ శ్రేణి నాయకులు చేస్తున్న కబ్జాల పర్వంలో కాకినాడ గ్రామీణ ప్రాంతం స్వామి నగర్‌లో కోట్ల రూపాయల విలువచేసే కామన్ సైట్ కైంకర్యానికి గురయ్యిందనే వాదనలు వినిపిస్తున్నాయి. సుమారు 10 సెంట్ల భూమిని స్థానిక నాయకుడు కబ్జాచేసి అనంతరం రూ .3 కోట్ల రూపాయలు చేతులు మారాయి అనే అభియోగం పై తూరంగి మాజీ ఎంపీటీసి పితాని వెంకటరాము స్పందించారు. గత తెలుగు దేశం పార్టీ హయాంలో సర్వే నెంబర్ 112,113లో అప్పటి ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి 63 మంది లబ్ధిదారులకు నివేశ స్థలాల పంపిణీ కార్యక్రమంలో పట్టాలు పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. ఈ సర్వే నంబర్లో ఉన్న భూమి పల్లపు ప్రాంతం కావడంతో దానిని మెరక చేసుకోలేక లబ్ధిదారులు ఆగిపోయారు. అనంతరం ఎన్నికలు రావడం వైకాపా ప్రభుత్వం అధికారంలోకి రావడంతో స్వామినగర్ ఇళ్ళ స్థలాల వివాదంలో చిక్కుకుంది. పాత లబ్ధిదారుల స్థానంలో వైకాపా కార్యకర్తలకు చోటు ఇవ్వడంతో పరిస్థితి మరింత జటిలంగా మారి న్యాయస్థానం, లోకాయుక్త గడప తొక్కింది. ఇప్పటికీ ఈ అంశం కోర్టు పరిధిలో కొనసాగుతూనే ఉందని మాజీ ఎంపిటిసి పితాని వివరించారు. సందట్లో సడేమియా అన్నట్లు ఈ లే అవుట్‌కు సంబంధించిన కామన్ సైట్, అప్పుడు ఎమ్మార్వో చేసిన లే అవుట్‌ను మార్చి కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కన్నబాబుకు తెలియకుండా కోట్ల రూపాయల జేబులో నొక్కేసిన స్థానిక వైకాపా నాయకుడి అవినీతి పై ఎమ్మెల్యే కన్నబాబు విచారణ జరిపించి దోషులపై చర్యలు తీసుకోవాలని పితాని రాము డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే పేరు చెప్పి ప్రజాధనాన్ని లూటి చేసే అవినీతి నాయకులను ప్రోత్సహించే విధానానికి ఎమ్మెల్యే కన్నబాబు దూరంగా ఉండాలని హితవు పలికారు. అధికార యంత్రాంగాన్ని సైతం శాసించే ఇటువంటి చోటా నాయకుల కదలికల పై దృష్టి సారించి ప్రభుత్వానికి చెడ్డపేరు రాకుండా కాపాడాల్సిన బాధ్యత కూడా జిల్లా పార్టీ అధ్యక్షుడిగా కన్నబాబుకు ఉందని మాజీ ఎంపిటిసి పితాని కోరారు.

బొండాల రకం ధాన్యం కొనుగోలు చేయాలి

విశాలాంధ్ర - కపిలేశ్వరపురం : తడిసిన ధాన్యానికి మద్దతు ధరతో పాటు నష్టపోయిన వరి రైతుకు ఎకరాకు రూ.25 వేల చొప్పున నష్టపరిహారం అంద జేయాలని మండపేట ఎమ్మెల్యే వేగుళ్ళ డిమాండ్ చేశారు. అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులను గురువారం కపిలేశ్వరపురం మండలంలో అచ్యుతాపురం, వెదురుమూడి, అంగర, పడమరఖండ్రిక, టేకి, మాచర గ్రామాలలో మండపేట ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు మాట్లాడుతూ అకాల వర్షాల కారణంగా జరిగిన పంట నష్టం వలన రైతులు కన్నీరు మున్నీరవుతున్నా రన్నారు. తమది రైతు ప్రభుత్వం అని పదే పదే చెప్పుకునే ఈ వైసీపీ ప్రభుత్వానికి రైతులు గోడు పట్టడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో అచ్యుతాపురం, వెదురుమూడి, అంగర, పడమరఖండ్రిక, టేకి, మాచర గ్రామాల తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు

విశాలాంధ్ర-దేవరపల్లి: తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు డిపిఓ దేవరపల్లి మండల పరిషత్ ప్రత్యేక అధికారి పి.జగదాంబ వెల్లడించారు. దేవరపల్లి మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీడీవో తహసీల్దారుతో ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జగదాంబ మాట్లాడుతూ గౌరీపట్నం, దుద్దుకూరు, ఎర్నగూడెం గ్రామాలలో ధాన్యాన్ని తాను పరిశీలించా నని వెల్లడించారు. ధాన్యాన్ని తరలించడానికి 2000 గోనెసంచులు సిద్ధం చేశామని ఆమె తెలిపారు. దేవరపల్లి మండలంలో మిల్లర్లతో సంప్రదించామని ధాన్యం తరలించడానికి ప్రత్యేక ట్రాక్టర్లు ఏర్పాటు చేసుకోవాలని ఆమె రైతులు సూచించారు.ఈ సమీక్షలో తహసీల్దార్ రామకృష్ణ, ఎంపీడీవో కల్లూరి ఉమామహేశ్వర శర్మ పాల్గొన్నారు.

ఆరబోసిన ధాన్యాన్ని సేకరించండి

విశాలాంధ్ర - చాగల్లు : రైతులు రోడ్లపై ఆరబోసిన ధాన్యాన్ని ఆఫ్లైన్లో వెంటనే కొనుగోలు చేయాలని జాయింట్ కలెక్టర్ తేజ్ భరత్ ఆదేశించారు. చాగల్లు మండలం లోని నందిగంపాడు రైతు భరోసా కేంద్రాన్ని గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రోడ్లపై ఆరబోసిన ధాన్యాన్ని ఆయన పరిశీలించారు. గోనెసంచుల లభ్యత వివరాల గురించి ఆయన సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం నందిగంపాడు గ్రామంలోని రైస్ మిల్లుకు జెసి వెళ్లి రికార్డులు పరిశీలించారు. చాగల్లు తాసిల్దార్ కె.రాజ్యలక్ష్మి మాట్లాడుతూ ఆఫ్లైన్లో గురువారం 86.32 ధాన్యాన్ని కొనుగోలు చేసినట్టు తెలిపారు. డిప్యూటీ తహసీల్దార్ కె. నిరంజన్ కుమార్, వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ వాహనాలకు జీపీఎస్ సిస్టమ్

విశాలాంధ్ర - కాకినాడ : పారిశుధ్యం, ఇంజనీరింగ్, టౌన్‌ప్లానింగ్ పరిధిలో పనిచేసే ప్రతీ ఒక్క వాహనానికి గ్లోబల్ పొజిషనింగ్ సిస్టమ్ (జీపీఎస్)ను అమలు చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ డాక్టర్ మహేష్‌కుమార్ రావిరాల ఆదేశించారు. గురువారం ఆయన అధికారులతో కలిసి బొందగుంటలోని వెహికల్ యార్డును సందర్శించారు. అక్కడ ఉన్న కంపాక్టర్లు, జేసీబీలు, సెప్టిక్ ట్యాంక్ క్లీనర్లు సహా మొత్తం 59 వాహనాలను నిలుపుదల చేసే ప్రాంతాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మొత్తం వాహనాలు ఎన్ని? అన్నీ కండీషన్‌లో ఉన్నాయా? మరమ్మతులు ఏమైనా చేయాలా? వాటి పనితీరు ఎలా ఉంది? వంటి అంశాలను ఆరా తీశారు. రానున్న వర్షాకాలన్ని దృష్టిలో ఉంచుకుని ఆయా వాహనాల ఆవశ్యకత దృష్ట్యా అన్నింటిని పూర్తిస్థాయిలో వినియోగంలోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రధానంగా ఈ వాహనాల కథలికలు, సమయవేళలను ఎప్పటికప్పుడు గుర్తించి పర్యవేక్షించేందుకు ఆధునిక, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలని ఆదేశించారు. ముఖ్యంగా ప్రతీ ఒక్క వాహనానికి జీపీఎస్ సిస్టమ్ పెట్టాలని ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్‌కు సూచించారు. అలా చేయడం వల్ల వాహనాలపై పనిచేసే సిబ్బంది పనితీరు మెరుగుపడడంతోపాటు ఆయా వాహనాలు ఎక్కడెక్కడ ఏ ప్రాంతంలో ఉన్నాయో సమాచారం అందుబాటులో ఉంటుందన్నారు. ప్రజలకు మరిన్ని మెరుగైన సేవలు కూడా అందించగలమని కమిషనర్ పేర్కొన్నారు. వాహనాలపై పనిచేసే డ్రైవర్లు, ఉద్యోగులు మరింత సమర్థవంతంగా పనిచేయాలన్నారు. ఈ కార్యక్ర మంలో ఆయన వెంట ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్, ఈఈ వెంకట్రావు, ఏఈ విరూపాక్షం, శానిటరీ ఇన్స్‌పెక్టర్ లాజర్ తదితరులు ఉన్నారు.

తూతూ మంత్రంగా సర్వసభ్య సమావేశం

విశాలాంధ్ర - గోపాలపురం : ప్రజల సమస్యలు అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించ వలసిన ప్రజాప్రతినిధులే సర్వసభ్య సమావేశానికి హాజరు కాకపోవడం విశేషం. గ్రామాల అభివృద్ధిలో కీలక పాత్ర పోషించే అధికారులు సైతం సమావేశానికి హాజరుకాకపోతే ప్రజా సమస్యలు పరిష్కరించేది ఎవరని పలువురు ప్రజా ప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ ఉండవల్లి సత్యనారాయణ అధ్యక్షతన నిర్వ హించారు. ఈ సమీక్ష సమావేశంలో సగ్గొండ సర్పంచ్ ఎండపల్లి శేఖర్ బాబు, రాజంపాలెం సర్పంచ్ కురుకూరి ధనలక్ష్మి, దొండపూడి సర్పంచ్ మల్లెపూడి అచ్చిబాబు, తమ గ్రామాలలో విద్యుత్ సమస్యలు నిరంతరము ఉంటుండగా లైన్ మెన్ అందుబాటులో లేకపోవడం, లో వోల్టే సమస్యలు, విద్యుత్ వైర్లు క్రిందకు సాగిపోయి ప్రమాద పరిస్థితులు నెలకొన్న స్థితిలో ఉన్నప్పటికీ పలుమార్లు విద్యుత్ శాఖ అధికారికి చెప్పినా పరిష్కారం కాలేదని ప్రజాప్రతి నిధు లుగా ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన బుట్టదాఖలే అవుతున్నా యని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశానికి హాజరుకాని అధికారులకు నోటీసులు జారీచేయాలని ఎంపీడీవో ఆర్ శ్రీదేవికి సూచించారు తెలిపారు. ఈ కార్యక్ర మంలో సర్పంచులు ఎంపీటీసీలు హాజరయ్యారు.

నిరసన

విశాలాంధ్ర - మామిడికుదురు : మండల పరిధిలోని మగటపల్లి గ్రామంలో కొత్తగా తవ్వుతున్న ఉప్పునీటి రొయ్యల చెరువులు నిలుపుదల చేయాలని పలువురు గురువారం మామిడి కుదురు తహశీల్దారు సీహెచ్ నాగ లక్ష్మికి వినతి పత్రాన్ని అందజేశారు. రొయ్యల చెరువులు తవ్వకాల వల్ల కొబ్బరి, వరి పంటలు దెబ్బతిన్నాయి అని త్రాగునీరు కలుషితం అవు తుందని డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్‌కి అందించారు.

వేలం ప్రకటన

S.No.	Vehicle No.	Vehicle Name	Model
01.	AP39 KK 5607	Activa	2021
02.	AP39 FU 4590	HF Deluxe	2020
03.	AP39 HL 9939	Vespa	2020
04.	AP39 EF 7449	Activa 5G	2019
05.	AP39 S 5466	Glamour	2019
06.	AP39 AK 3135	Pleasure	2019
07.	AP39 AK 1561	Glamour	2019
08.	AP39 AK 7885	Activa	2018
09.	AP05 EX 1751	Pulsar150	2018
10.	AP39 AB 4254	Vespa	2018
11.	AP05 EX 1634	Activa	2018
12.	AP05 EV 2583	Glamour	2018
13.	AP05 EE 6893	Glamour	2017
14.	AP05 DC 0362	Activa	2016
15.	AP05 DL 4445	Activa	2016
16.	AP05 DQ 5828	Glamour	2016
17.	AP05 DV 6781	Pleasure	2016
18.	AP05 DL 5854	Duet	2015
19.	AP05 DG 9646	Fascino	2015
20.	AP05 DK 1726	Unicorn	2015
21.	AP05 DG 6805	Pleasure	2015
22.	AP05 DR 0932	Pulsar150	2014
23.	AP05 CY 6413	Pleasure	2014
24.	AP05 DC 2424	Activa	2014
25.	AP05 CJ 5892	Glamour	2013
26.	AP31 CD 4170	Pleasure	2013
27.	AP05 CR 4462	Dream Yuga	2013
28.	AP05 CM 1030	Glamour	2013
29.	AP05 BR 8623	Unicorn	2010

పైన తెలుపబడిన వాహనములు **ది. 06-05-2023వ తేదీన ఉదయం 10 గం.ల నుండి 12 గం.ల వరకు** వేలం జరుగును. వేలంలో పాల్గొనదలచినవారు ఈ క్రింది చిరునామాలో సంప్రదించి వేలంలో ఎవరైనా పాల్గొనవచ్చును. వేలంలో పాల్గొనువారు ఆధార్ కార్డ్ తప్పని సరిగా తీసుకురావలెను.

అన్నపూర్ణ వెహికల్ ఫైనాన్స్
హోటల్ రాయల్ పార్క్ ఎదురుగా, సినిమా రోడ్,
కాకినాడ. సెల్: 96421 11466

S.V.R. ఫైనాన్స్
బొగ్గవరపు మున్సిపల్ కాంప్లెక్స్, సినిమా రోడ్,
కాకినాడ. సెల్: 99485 73666

అమరావతి వెహికల్ ఫైనాన్స్
డో.నెం. 19-1-13/4
3 టౌన్ పోలీస్ క్వార్టర్స్ ఎదురుగా, సినిమారోడ్,
కాకినాడ. సెల్: 99128 15333

ఇంటింటికి గోదావరి జలాల వాటర్ గ్రిడ్ పనులు ప్రారంభం

విశాలాంధ్ర - సీతానగరం : ఇంటింటికి గోదావరి జలాల వాటర్ గ్రిడ్ పనులు ప్రారంభం అయ్యాయి. రాజానగరం నియోజకవర్గం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా కృషితో రాజానగరం నియోజకవర్గంకు జల జీవన్ మిషన్ నుండి 215 కోట్ల రూపాయల వాటర్ గ్రిడ్ పనులు మంజూరైన సంగతి అందరికీ తెలిసిందే. ఈ పనులను వేగవంతం చేయడానికి గురువారం సీతానగరం మండలంలో పురుషోత్తపట్నం గ్రామంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈఎస్ఈ బాల శంకర్‌రావు, డీఈఈ రవి కుమార్ సత్య సాయి ఇంటెక్ వెల్, గోదావరి పరివాహక ప్రాంతంను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఈ బాల శంకర్‌రావు విలేకరులతో మాట్లాడుతూ జలజీవన్ మిషన్ గ్రాంట్ 215 కోట్ల రూపాయల గోదావరి నీరు నియోజకవర్గంలో గల రాజానగరం, కోరుకొండ, సీతానగరం మండలలో గల అన్ని గ్రామాలకు గోదావరి త్రాగు నీరు అందించాలనే ఎమ్మెల్యే జక్కంపూడి రాజా కృషి వల్ల జిఓ 232 ద్వారా ఉత్తర్వులు జారీ అయ్యాయని అన్నారు. దీనికి అనుగుణంగా ఇంటెక్ వెల్, వాటర్ హెడ్ ట్యాంకులు, పైప్ లైన్ల నిర్మాణం పనులను ప్రారంభించడానికి పరిశీలించడం జరిగిందన్నారు. త్వరలోనే టెండర్లు పిలిచి పూర్తి చేసి పనులను ప్రారంభించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సీతానగరం జెఈ అవినాష్, కోరుకొండ జెఈ నరేష్ మొదలగు అధికారులు పాల్గొన్నారు.

ఎటువంటి నష్టం రాకుండా చూస్తా

విశాలాంధ్ర -కాకినాడ రూరల్ : స్థానిక కరప మండలంలో కాకినాడ రూరల్ నియోజకవర్గం శాసనసభ్యులు, మాజి మంత్రి, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కాకినాడ జిల్లా అధ్యక్షులు కురసాల కన్నబాబు పర్యటించి ఇటీవలే అకాల వర్షాలకు దెబ్బతిన్న పంట పొలాలను, మొలకెత్తిన ధాన్యాల రాశులను పరిశీలించి రైతులకు ఎటువంటి నష్టం కలుగకుండా చూడాలని అధికారులను ఆదేశించి నష్టపోయిన రైతులకు ధైర్యం చెప్పారు. ఆయన వెంట కరప జెడ్పీటీసీ యాళ్ల సుబ్బారావు, రూరల్ ఎంపీపీ గోపిశెట్టి పద్మజా బాబ్జి, వ్యవసాయ శాఖ అధికారులు, వైసీపీ నాయకులు ఉన్నారు.

నేడు ఈకేవైసీ

విశాలాంధ్ర - సీతానగరం : పదవీ విరమణ ఉద్యోగులకు సీతానగరం మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఈకేవైసీ చేయనున్నట్లు ఎంపిడివో కె. రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఎంపిడివో రమేష్ మాట్లాడుతూ పదవి విరమణ చేసిన ప్రభుత్వ ఉద్యోగులకు మే 5 వతేదీ శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ట్రెజరీ ఆఫీస్ కోరుకొండ వారి ద్వారా ఈకెవైసీ చేయబడుతుందని ఈ అవకాశాన్ని అర్హత కలిగిన అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రైతుల్ని తక్షణమే ఆదుకోవాలి

విశాలాంధ్ర - అంబాజీపేట : వర్షాల వల్ల నష్టపోయిన రైతుల్ని తక్షణమే ఆదుకోవాలని స్థానిక మండల రెవెన్యూ కార్యాలయం వద్ద గురువారం జనసేపార్టీ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు అంబాజీపేట మండల రెవెన్యూ అధికారికి వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో తడిసిన ధాన్యాన్ని వెంటనే ప్రభుత్వం కొనుగోలు చేయాలని, తడి, పొడి ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులను వెంటనే ఆదుకోవాలని, సహకార రుణాలు మాఫీ చేయాలని, ఇన్ ఫుట్ సబ్సిడీ ఇవ్వాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఉపాధ్యక్షులు శిరిగినీడి వెంకటేశ్వరరావు, నాయకులు రైతులు, సాకా బాబూజీ, మట్టపర్తి సోమేశ్వరావు, దాసరి వీర వెంకట సత్యనారాయణ, కొర్లపాటి వెంకటేశ్వరావు (ఢిల్లీ), మైపాల తాతాజీ, అరిగెల సూరిబాబు, పితాని రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కాకినాడలో న్యూహ్యుండయ్ ఆథరైజ్డ్ షోరూం ప్రారంభం

విశాలాంధ్ర - కాకినాడ: స్థానిక జగన్నాధపురంలోని అన్నమఘాటీవద్ద నూతనంగా ఏర్పాటు చేసిన హ్యుండయ్ అధరైజ్ షోరూమ్‌ను గురువారం ప్రారంభించారు. విజయవాడకు చెందిన సాయిస్వర్ణ హుండయ్ యాజమాన్యం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ప్రముఖ ఆధ్యాత్మికవేత్త చాగంటి కోటేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా సాయిస్వర్ణ హ్యుండయ్ అధినేత దండమూడి స్టాలిన్‌బాబు మాట్లాడుతూ కాకినాడ నగరంలో హుండయ్ కార్లకు సేవలందించేందుకు అతిపెద్ద సర్వీస్ సెంటర్‌ను ప్రారంభించామని, అన్నిరకాల కార్లు అందుబాటులో ఉంటాయన్నారు. ఎంపిక చేసిన నూతనకార్ల కొనుగోలుపై 5గ్రాముల ఉచిత బంగారుకాయిన్ అందిస్తున్నా మని, వాహనం సర్వీసుకు ఇచ్చిన వారికి ఉచిత పికప్, డ్రాపింగ్ సదుపాయం కల్పిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖాతాదారులు, ఫైనాన్స్, ఇన్సురెన్స్ సంస్థ ప్రతినిధులు, షోరూం సిబ్బంది పాల్గొన్నారు.

రైతులు ఆందోళన చెందవద్దు

విశాలాంధ్ర - తాళ్లపూడి :తుపాను, ప్రతికూల వాతావారణం ఏర్పడిన సందర్భం లో రైతులకు భరోసా కల్పిస్తూ ప్రభుత్వం చర్యలు తీసుకుందని, తేమ ధాన్యం కొరకు ఆందోళ చెందనవసరం లేదని, ఎటువంటి ధాన్యాన్నయినా మిల్లర్ల కు తరలించవచ్చని మండల తహశీల్దార్ రాధిక తెలిపారు. జిల్లా జాయింట్ కలెక్టర్, కొవ్వూరు ఆర్డీఓ ఆదేశాల మేరకు తాళ్ళపూడి మండలం లోని ఆయా సచివాలయాల రైతు భరోసా కేంద్రాల కు ఒక్కొక్క రైస్ మిల్లు ను కేటాయించారని, తడిచిన ధాన్యాన్ని సైతం రైస్ మిల్లులో తీసుకోవాలన్న ఆదేశాలు జారీ అయ్యాయని తహశీల్దార్ తెలిపారు.

తక్షణ చర్యలకు ఆదేశం

విశాలాంధ్ర - అనపర్తి : నియోజకవర్గంలో కురుస్తున్న భారీ వర్షాలకు వరి పంటకు తీవ్ర నష్టం కలిగిందని దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారని నష్టపోయిన రైతులను ఆదుకోవాలని సివిల్ సప్లైస్ కార్పొరేషన్ లిమిటెడ్ వైస్ చైర్మన్, ఎండి వీర పాండ్యన్‌కి గురువారం ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి విజ్ఞప్తి చేశారు. దీనికి స్పందించిన ఎండి జాయింట్ కలెక్టర్ తో మాట్లాడి రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా తక్షణమే తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణ రెడ్డి తెలిపారు.

ఉప్పుటేరులో వేటకు వెళ్లి బాలుడి మృతి

విశాలాంధ్ర - కాట్రేనికోన : మండలంలోని తీర గ్రామం పల్లంలో స్నేహితులతో కలసి గురువారం ఉప్పుటేరులో చేపలను వేటాడేందుకు వెళ్లిన స్థానిక బాలుడు పాలెపు జగన్ (14) నీటిలో మునిగి మృతి చెందాడు. ఈ సంఘటన స్థానికులను కలచివేసింది. వేసవి శలవులు కావడంతో తమ తల్లిదండ్రులకు చేదోడుగా ఉంటుందని తమ కులవృత్తి అయిన చేపలవేటకు స్నేహితులతో కలిసి జగన్ వెళ్ళాడు. ఉప్పుటేరులో లోతుగా ఉన్నచోట నీటిలో దిగడంతో నీటి ప్రవాహంలో జగన్ కొట్టుకుపోయాడు. వెంటనే స్థానికులు అతని తల్లిదండ్రులు పడవల సహాయంతో ఉప్పుటేరులో గాలించగా, తండ్రికే బాలుడి మృతదేహం సాయంత్రానికి దొరకడంతో తండ్రి కన్నీరుమున్నీ రయ్యాడు. ఈ ఘటనతో పల్లం గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

అప్పుల్లో రైతాంగం

విశాలాంధ్ర -కొయ్యలగూడెం : అకాల వర్షాల కారణంగా పంటలు నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వమే ఆదుకోవాలని పోలవరం మాజీ శాసనసభ్యులు మొడి యం శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇటీవల కురిసిన వర్షాల వల్ల నియోజకవర్గంలో ధాన్యం, మొక్కజొన్న, పొగాకు, మిర్చి పంటలు పూర్తిగా పాడైపోయాయని రైతాంగం తీవ్రంగా నష్టపోయి పీకల్లోతుల్లో అప్పుల్లో మునిగిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది ప్రకృతి తప్పిదమని ప్రభుత్వం చెబుతుందని వాస్తవంగా రైతు భరోసా కేంద్రాలలో సకాలంలో ధాన్యం కొనుగోలు చేస్తే రైతులకు నష్టపోయేవారు కాదని తెలిపారు. ఇది ప్రభుత్వ వైఫల్యమేనని స్పష్టం చేశారు. ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టి ఉంటే రైతులు నష్టపోయేవారు కాదన్నారు. ప్రభుత్వ యంత్రాంగం గ్రామస్థాయిలో వర్ష ప్రభావంతో నష్టపోయిన పంటలను గుర్తించి అంచనా వేసి నివేదికను సమర్పించి తక్షణం సాయం అందించే దిశగా కృషి చేయాలని కోరారు. లేనిపక్షంలో రైతులు తరఫున న్యాయం జరిగే వరకూ టిడిపి పోరాడుతుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

మనకోసం మనం ఆధ్వర్యంలో నిత్యావసరాల పంపిణీ

విశాలాంధ్ర - పోడూరు : మనకోసం మనం స్వచ్ఛంద సేవా సంస్థ 5వ వార్షికోత్సవం, గురువారం పోడూరు మండలం జిన్నూరు సుబ్బారాయుడు కాలనీలో ఘనంగా జరిగింది. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు పడాల పెద్దిరాజు, కృష్ణవేణి ఆధ్వర్యంలో పలువురు ప్లాట్ రిక్షా కార్మికులకు, పంచాయతీ పారిశుధ్య కార్మికులకు నిత్యావసరాలను అందించారు. పెద్దిరాజు మాట్లాడుతూ సేవ చేయడంలో ఉండే తృప్తి వెలకట్టలేనిదన్నారు. అందరి సహకారంతో విజయవంతంగా ఐదో వార్షికోత్సవం జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. ముఖ్య అతిధులుగా సర్పంచ్ జమ్ము బేబీ మహా లక్ష్మి, జిన్నూరు సొసైటీ అధ్యక్షుడు డీటీడీసీ బాబు, పాలవలస తులసీరావు పాల్గొన్నారు. సంస్థ సభ్యులు కలిశెట్టి కనకారావు, దాసరి సత్యనారాయణ, కలిశెట్టి లక్ష్మి, భూపతి రాజు చిన్నసూరి, గండేటి శేఖర్, రవి, గ్రామ పెద్దలు, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా శ్రీనివాసుని కళ్యాణం

విశాలాంధ్ర - ద్వారకాతిరుమల : బ్రహ్మోత్సవాల్లో ముఖ్యఘట్టమైన ద్వారకాతిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి వారి కళ్యాణ మహోత్సవం గురువారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. శ్రీశోభకృత్‌నామ సంవత్సరం, వైశాఖమాస బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీనివాసుని కళ్యాణం గోవిందనామస్మరణలు, వేదమంత్రోచ్ఛరణల మధ్య కడురమణీయంగా సాగింది. శ్రీవారి తూర్పుగాలిగోపురం ఎదురుగా భారీకళ్యాణవేదికను ఏర్పాటుచేసి కళ్యాణ పరిసరాలతోపాటు ఆలయ పరిసరాలన్నీ విద్యుద్దీప అలంకరణలు చేశారు. ముందుగా రకరకాల పుష్పమాలికలతో, పచ్చిపూలతో, బెంగుళూరు పుష్పాలతో, అరటిబోదెలతో, మామిడితోరణాలతో, విద్యుద్దీప అలంకరణలతో, కళ్యాణవేదికను సర్వాంగ సుందరంగా అలంకరించారు. అనంతరం ఆలయంలో తొళక్కం వాహనంపై శ్రీవారి, అమ్మవార్ల కళ్యాణమూర్తులను వేంచేపుచేసి ప్రత్యేక అలంకరణలు చేశారు. ఆలయ అర్చకులు వేదపండితులు, ఆగమపాఠశాల విద్యార్థుల వేదమంత్రోచ్ఛరణలు గజ, అశ్వసేవల నడుమ వాహనాన్ని కళ్యాణవేదికవద్దకు తెచ్చారు. అప్పటికే వేదికపై ప్రత్యేకంగా అలంకరించిన రజిత సింహాసనంపై కళ్యాణమూర్తులను ఉంచి అర్చకులు కళ్యాణతంతు ప్రారంభించారు. కళ్యాణమహోత్సవానికి దేవాదాయశాఖ మంత్రి కొట్టుసత్యన్నారాయణ, గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, ఎంపీపీ బొండాడ మోహినీ వెంకన్నబాబు, తదితర ప్రముఖులు హాజరయ్యారు.

విశ్వేశ్వరస్వామి సేవలో ఎంఎల్‌సి జయమంగళ

విశాలాంధ్ర-మండవల్లి: ప్రముఖ పుణ్యక్షేత్రమైన లింగాల గ్రామంలోని గంగా విశాలాక్షిసమేత శ్రీవిశ్వేశ్వరస్వామి వారి కళ్యాణ మహోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో శాసనమండలి సభ్యులు జయమంగళ వెంకటరమణ పాల్గొని గురువారం నాడు ప్రత్యేక పూజలు నిర్వహించి ఉత్సవాలను తిలకించారు. పురోహితులు ఆశీర్వచనాలు తీసుకున్నారు. కార్యక్రమంలో ఆలయచైర్మన్ రాజులపాటి యశోధనరావు ,ఆలయ ఈవో శింగనపల్లి శ్రీనివాసరావు,ఎంపిటిసి కమదన శేషతల్పారావు, ఖాదర్‌బాషా, స్థానికులు పాల్గొన్నారు.

ఎంపీ మిథున్ రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే గ్రంధి

విశాలాంధ్ర -భీమవరం టౌన్: వైసీపీ రీజనల్ కోఆర్డినేటర్, ఎంపీ పి.మిథున్ రెడ్డి ఉండి నియోజకవర్గ పార్టీ సమీక్ష సమావేశానికి హాజరయ్యేందుకు గురువారం భీమవరం రాగా, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ యూత్ క్లబ్ వద్ద ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం భీమవరం నియోజకవర్గంలోని పలు అభివృద్ధి పనులకు సంబంధించి నిధులు మంజూరు కై వినతి పత్రం అందించారు. అనంతరం ఉండి సమీక్షా సమావేశంలో పాల్గొని మాట్లాడారు.

దెబ్బతిన్న మొక్కజొన్న పంటను పరిశీలించిన టీడీపీ బృందం

విశాలాంధ్ర-కొయ్యలగూడెం: మండలంలో అకాల వర్షాల వల్ల దెబ్బతిన్న మొక్కజొన్న పంటను టిడిపి మండల కొయ్యలగూడెం అధ్యక్షులు పారేపల్లి నరేష్, ప్రతినిధి బృందం ఆధ్వర్యంలో పరిశీలించింది. ఈ సందర్భంగా పారేపల్లి నరేష్ మాట్లాడుతూ అకాల వర్షాలు వల్ల దెబ్బతిన్న రైతులను వెంటనే ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. మండలంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి దెబ్బతిన్న పంటను కూడా కొనుగోలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కొనుగోలు చేయని పక్షంలో టిడిపి తరుపున పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కొయ్యలగూడెం పట్టణ అధ్యక్షులు జేష్ఠ రామకృష్ణ, ఏలూరు పార్లమెంట్ తెలుగు మహిళ అధ్యక్షురాలు చింతల వెంకటరమణ,బూత్ కన్వీనర్ మత్తపటి నాగేశ్వరరావు, ఏలూరు పార్లమెంట్ టిఎన్ఎస్ఎఫ్ అధికార ప్రతినిధి పారేపల్లి పవన్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఎంపీపీ అధ్యక్షునిగా పేరిచర్ల

భీమవరం -భీమవరం టౌన్ : పశ్చిమగోదావరి జిల్లా ఎంపీపీ అధ్యక్షునిగా భీమవరం మండల ఎంపీపీ పేరిచర్ల విజయ నరసింహారాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. భీమవరంలో గురువారం జరిగిన పశ్చిమగోదావరి జిల్లా ఎంపీపీల సమావేశంలో ఎంపీపీలందరూ కలిసి నరసింహ రాజు ను జిల్లా అధ్యక్షులుగా ఎన్నుకున్నారు. ఈ సమావేశం రాష్ట్ర ఎంపీపీల సంఘం కన్వీనర్ మేకల హనుమంతరావు అధ్యక్షతన జరిగింది. అనంతరం నూతన పాలకవర్గం స్థానిక ఎమ్మెల్యే గ్రంధిశ్రీనివాస్ ను స్థానిక క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలాల అభివృద్ధికి ఎంపీపీలు కృషి చేయాలని కోరారు. ముందుగా నరసింహారాజును సత్కరించారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు రుద్ర ధనరాజు, ఉపాధ్యక్షులు సబ్బితి సుమంగళి సాగర్, ప్రధాన కార్యదర్శి కొప్పిశెట్టి అలివేలు మంగతాయారు, అధికార ప్రతినిధి కర్రి వెంకట నారాయణ రెడ్డి, కార్యదర్శులు దాసరి హైమావతి, నల్లి జయలక్ష్మి, రాష్ట్ర కమిటీ సభ్యులు ఇందుకూరి శ్రీహరి నారాయణరాజులు పాల్గొన్నారు.

రైతుల్ని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే

విశాలాంధ్ర - అనపర్తి : ఏప్రియల్ మొదటి వారంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి కొనుగోలు ప్రక్రియ మొదలుపెట్టినట్లయితే రైతులు నేడు ఈ దుర్భర పరిస్థితి ఎదుర్కొనే వారు కాదని రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. గురువారం కొప్పవరంలో వర్షానికి తడిసిన, రంగు మారిన, మొలకెత్తిన ధాన్యం రాశులు, కల్లాలు, పొలాలను రామకృష్ణారెడ్డి, టిడిపి శ్రేణులు పరిశీలించి రైతుల గోడు తెలుసుకున్నారు.

అనంతరం నల్లమిల్లి మాట్లాడుతూ పౌరసరఫరాల శాఖ మంత్రి ప్రెస్ మీట్ లు పెట్టి ప్రకటనలకు మాత్రమే పరిమితం అవుతున్నారని, క్షేత్రస్థాయిలో రైస్ మిల్లర్స్, ప్రజా ప్రతినిధులు కుమ్మక్కై దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు.

ఈ కార్యక్ర మంలో జిల్లా తెలుగు రైతు అధ్యక్షులు సిరసపల్లి నాగేశ్వరరావు, జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షులు తమలంపూడి సుధాకర్ రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి కర్రి వెంకటరామారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ మల్లిడి శ్రీనివాసరెడ్డి తదితరులు ఉన్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూలో 26 మంది ఎంపిక

విశాలాంధ్ర -ఏలూరు : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ , హెచ్ సి ఎల్ టెక్నాలజీస్ లిమిటెడ్ సంయుక్త ఆధ్వర్యంలో సర్ సి.ఆర్ రెడ్డి ఇంజనీరింగ్ కళాశాల, వట్లూరులో ఏర్పాటు చేసిన హెచ్ సి ఎల్ టెక్ బీ "క్యాంపస్ డ్రైవ్" కెరీర్ ప్రోగ్రాంకు 105 మంది అభ్యర్థులు హాజరై 26 మంది మొదటి దశలోలో అర్హత పొందారని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఇ తమ్మాజీ రావు తెలిపారు. ఈ సందర్భంగా తమ్మాజీరావు మాట్లాడుతూ గత సంవత్సరం లో కూడా హెచ్ సి ఎల్ నుంచి ఇంటర్న్ షిప్ పూర్తి చేసుకొని ఉద్యోగాలలో చేరారని ఐటి రంగంలో అవకాశాలు మెండుగా ఉన్నాయని ఇంటర్ పూర్తి చేసిన అభ్యర్థులకు ఇది ఒక మంచి అవకాశం అన్నారు. ఎర్లీ కెరీర్ ప్రోగ్రాం ద్వారా ఐటి కెరియర్ మొదలుపెట్టాలనుకునే వారికి ఇది సువర్ణ అవకాశం అన్నారు.ఈ కార్యక్రమం లో హెచ్ సి ఎల్ మేనేజర్ అనిల్ మాట్లాడుతూ హెచ్ సి ఎల్ వంటి పెద్ద సంస్థ లలో చేరటానికి ఇది పెద్ద అవకాశం అని భారతదేశంలో 8 బ్రాంచ్ లు ఉన్నాయన్నారు. ఐటి కు భవిష్యత్లో మంచి అవకాశాలు ఉన్నాయని యువత అంది పుచ్చుకోవాలని తెలిపారు. సీడాప్ జే.డి.ఎం పార్థసారధి మాట్లాడుతూ ఇంటర్ పూర్తి చేసిన అభ్యర్థులకు ఇది ఒక మంచి అవకాశం అని మొదటి రౌండ్ పూర్తి చేసిన అభ్యర్థులకు శుభాకాంక్షలు తెలియ జేసారు. ఈ కార్యక్రమం లో ఎపి ఎస్ ఎస్ డి సి సిబ్బంది, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

27న న్యూ జెర్సీలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

విశాలాంధ్ర -భీమవరం: అమెరికాలో ఉన్నత స్థానాల్లో ఉన్న ఎస్ ఆర్ కె ఆర్ ఇంజనీరింగ్ కళాశాల పూర్వ విద్యార్థులు ఈ నెల 27వ తేదీన అమెరికాలోని న్యూ జెర్సీలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఏర్పాటు చేశారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.జగపతి రాజు తెలిపారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని గురువారం కళాశాల ప్రిన్సిపాల్, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ ఎస్.ఆర్.కె నిశాంత్ వర్మలు మీడియాకు వివరాలందిస్తూ సుమారు 43 సంవత్సరాల సుదీర్ఘ చరిత్ర కలిగిన తమ కళాశాల పూర్వ విద్యార్థులు దేశ విదేశాలలో ఉన్నత స్థానాల్లో ఉన్నారన్నారు. సుమారు 600 మంది పూర్వ విద్యార్థులు ఒక బృందంగా ఏర్పడి ఎస్.ఆర్.కె.ఆర్ అల్యూమిని అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా (సానా) గా ఏర్పడ్డారు. విద్యార్థులు ఇప్పటికే అసోసియేషన్ లో చేరి ప్రప్రదముగా అమెరికాలోని న్యూ జెర్సీలో ఉన్న నార్త్ అమెరికా తెలుగు సొసైటీ కన్వెన్షన్ సెంటర్లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించేందుకు వివిధ కమిటీలుగా ఏర్పడి ఏర్పాట్లు ముమ్మరంగా చేస్తున్నారని తెలిపారు. పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో పాల్గొనేందుకు కళాశాల ప్రిన్సిపాల్, మేనేజ్మెంట్, పలువురు ప్రొఫెసర్ కూడా పాల్గొనేందుకు న్యూ జెర్సీ వెళ్తున్నట్లు వారు వెల్లడించారు.

మొక్కజొన్న రైతులను ఆదుకోవాలి

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం: తడిసిన మొక్కజొన్న పంట రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రాష్ట్ర కిసాన్ సెల్ అధ్యక్షులు జెట్టి గురునాథరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.గురువారం సాయంత్రం మండలంలోని పంగిడిగూడెం గ్రామంలో తడిసిన మొక్కజొన్న పంటను పరిశీలించి రైతులతో మాట్లాడారు. వారికి జరిగిన నష్టాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గురునాధరావు మాట్లాడుతూ పంగిడిగూడెం గ్రామంలో సుమారు 150 ఎకరాలకు పైగా మొక్కజొన్న పంట కల్లాలపై ఉండగా వచ్చిన అకాల వర్షం కారణంగా పంట మొత్తం తడిసి మొలకలు వచ్చాయని ఇది రైతులకు తీవ్ర నష్టాన్ని కలుగ చేసిందని వెంటనే ప్రభుత్వం స్పందించి నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించి పంటను ప్రభుత్వం వెంటనే కొనుగోలుచేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ముప్పిడి శ్రీనివాసరావు,పంగిడిగూడెం రైతులు, నాయకులు వనచర్ల లింగస్వామి, అడవికొట్టు రవి, బిరుదు గడ్డ రాజు, బాలు,జీడిగంటి రామారావు, నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

వసుధ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం: వేలేరుపాడు మండలం భూదేవి పేట గ్రామానికి చెందిన పి.కమలాకర్ కు ప్రమాదంలో పొట్ట భాగం నుండి కాళ్ళ వరకూ నచ్చు బడి పోవడంతో తన జీవనాన్ని చాలా ఇబ్బందిగా సాగిస్తున్నాడు. ప్రతీ నెలా మందులు తీసుకోవడానికి అతను పడుతున్న ఇబ్బందులను తెలుసుకున్న వసుధ ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకట రామరాజు నెలకు రూ.2 వేల చొప్పున బాధితుడు కమలాకర్ జీవితాంతం ప్రతీ నెల పించన్ ఇవ్వడానికి ముందుకు వచ్చింది.జంగారెడ్డిగూడెం పట్టణానికి చెందిన వసుధ ఫౌండేషన్ సభ్యులు కొండపల్లి పండు,సి. హెచ్.చంద్ర శేఖర్, కే.రామకృష్ణ బాధితుని గ్రామం వెళ్లి ఆ నగదు అందచేశారు.

ద్విచక్ర వాహనాలు వేలం

విశాలాంధ్ర-టి.నరసాపురం : ఎక్సైజ్ కేసులో పట్టుబడిన ద్విచక్ర వాహనాలకు వేలం పాట నిర్వహించినట్లు ఎస్సై కె. సతీష్ కుమార్ తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద గురువారం ఎక్సైజ్ శాఖ,పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జీలుగుమిల్లి సిఐ బి. వెంకటేశ్వరావు అధ్యక్షతన 18 వాహనాలకు వేలంపాట నిర్వహించగా 15 ద్విచక్ర వాహనాలు రూ. 2లక్షల 78వేలకు వేలం జరిగిందని 3వాహనాలకు వేలంపాట కొనుగోలుకు ఎవరూ ముందుకు రాలేదన్నారు. మిగిలిన వాహనాలకు మళ్ళీ వేలంపాట నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐ వై. దుర్గారావు, ఎస్సై, కానిస్టేబుల్ పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

విశాలాంధ్ర - పి గన్నవరం : ఇటీవల కురిసిన వర్షాల కారణంగా వరి పంటలు, ధాన్యం రాశులు తడిసిపోవడం వలన నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని పి గన్నవరం తెలుగుదేశం పార్టీ కన్వీనర్ గంటి హరీష్ మాధుర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన తెలుగుదేశం పార్టీ నాయకులతో కలిసి పి గన్నవరం మండలంలోని పి గన్నవరం, పోతవరం గ్రామాలలోని పలు ప్రాంతాలలో పర్యటించి ఇటీవల కురిసిన వర్షాల కారణంగా తడిసిన వరి పంటలను, ధాన్యం రాశులను పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక రైతులను వారికి కలిగిన నష్టంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ కోకన్వీనర్ నామన రాంబాబు, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డొక్కా నాథ్ బాబు, ఎంపీపీ అంబటి భూలక్ష్మి కోటేశ్వరరావు, పి. గన్నవరం గ్రామ సర్పంచ్ బొండాడ నాగమణి, జిల్లా తెలుగు రైతు అధ్యక్షుడు మట్ట ప్రభాకర్‌రావు, తెలుగు రైతు నాయకులు సంసాని పెద్దిరాజు, ఆరుమిల్లి లాల్ బాబు, టిడిపి నాయకులు నక్క వీర వెంకట సత్యనారాయణ, నేలపూడి దామోదర్, శేరు శ్రీనుబాబు, చొల్లంగి సత్తిబాబు, కొల్నాడ సత్యనారాయణ రాజు, సాధనాల ఎస్వీ, పైడి బుజ్జి, నక్క సునీల్ రాజు, సిఖిలే డేవిడ్ రాజు, కొపనాతి సీతారామస్వామి, చీకట్ల రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతను వెంటాడుతున్న వర్షాలు

విశాలాంధ్ర-భీమవరంటౌన్ : అకాల వర్షాల వల్ల అన్నదాతలను అనేక కష్టాలు వెంటాడు తున్నాయి. ఆరుగాలాల పాటు శ్రమించి పండిం చిన

ధాన్యాన్ని చివరకు చేతికందే పరిస్థితి లేక అన్నదాత ఆవేదన చెందుతున్నాడు. గత కొద్ది రోజుల నుంచి కురుస్తున్న వర్షాలు ప్రభావం వల్ల వరిచేలు నేలకొరిగాయి. అవి కొయించడానికి పని వారి దొరక్క యంత్రాలతో మాసూళ్ళ చేపట్టారు. అవి కాస్త వర్షాల ప్రభావం వల్ల చేలలో నీరు నిలిచిపోవడంతో వాత యంత్రాలు మట్టిలో కూరుకుపోతున్నాయి. దీంతో రైతులు చేసేదేమీ లేకఆందోళన చెందుతున్నారు.

రక్త హీనత రహిత జిల్లా కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలి

విశాలాంధ్ర-టి నరసాపురం: రక్త హీనత రహిత జిల్లా కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని సచివాలయ శాఖ జిల్లా కో ఆర్డినేటర్ టి ఎన్ స్నేహన్ తెలిపారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గ్రామ సచివాలయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశం మండల వైద్యాధికారి డాక్టర్ ఎమ్ శ్రీనివాస్ అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన స్నేహన్ మాట్లాడుతూ కౌమార దశలో వున్న బాలికలకు, గర్భిణీ స్త్రీలు, బాలింతలకు పౌష్టికాహారం అందించాలని తెలిపారు. వ్యక్తి గత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని అన్నారు. ఈ కార్యకమంలో సిహెచ్ ఓ పి ప్రసాదరావు, హెచ్ ఎస్ రవి, పిహెచ్ ఎన్ లలిత కుమారి ,కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు, ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

రైతాంగాన్ని ఆదుకోవాలి

విశాలాంధ్ర - గోపాలపురం : అకాల వర్షాలు, ఈదురు గాలులకు నష్టపోయిన రైతాంగాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని జనసేన పార్టీ

గోపాలపురం నియోజకవర్గ ఇన్చార్జ్ దొడ్డి గర్ల సువర్ణ రాజు డిమాండ్ చేశారు.జనసేన పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు పవన్ కళ్యాణ్ పిలుపు మేరకు గురువారం గోపాలపురం మండలం ,కొవ్వూరుపాడు గ్రామంలో అకాల వర్షాల కారణంగా నష్టపోయిన మొక్కజొన్న రైతులను ఆ గ్రామ జనసేన పార్టీ అధ్యక్షులు ప్రగడ రాంబాబు ఆధ్వర్యంలో, గోపాలపురం నియోజకవర్గం నాయకులు దొడ్డిగర్ల సువర్ణ రాజు పార్టీ నాయకులతో కలిసి పర్యటించి, పంట నష్టం జరిగిన రైతులకు గిట్టుబాటు ధర కల్పించి మానవతా దృక్పథంతో సరైన గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో షేక్ గౌస్,సత్యనారాయణ,పోలుమాటి నాని, మరియు గ్రామ నాయకులు చిలక వెంకన్న , వేగివాడ నాగేశ్వరరావు, శ్రీను, బాబు, తాతారావు,రవి కిరణ్,మంగరాజు , మోహన్ ,వీర మహిళ శాంతి జనసేనకులు తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్‌దారులు ఈకేవైసీ చేయించుకోవాలి

విశాలాంధ్ర - కామవరపుకోట : ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ప్రభుత్వ ఉద్యోగులందరూ పెన్షన్ పొందుతున్న ఉద్యోగులందరూ విధిగా సి ఎఫ్ ఎంసి చేసుకోవాలని చింతలపూడి సబ్ రిజిస్టర్ ఉద్యో గీ వీర్రాజు తెలిపారు. సి ఎఫ్ ఎంసి ఐడి పొందాలనుకునేవారు ఈ అనుసంధానం ఎంతో అవసరం అన్నారు. గురువారం కామవరపుకోట ఎంపీడీవో కార్యాలయం జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు రిటైర్డ్ ఉద్యోగులు కేవైసీ చేయించుకున్నారని తెలిపారు.

టీ కేఎం ఇన్నోవా క్రిస్టా టాప్ గ్రేడ్స్ ధరల ప్రకటన

విశాలాంధ్ర-కాకినాడ: టయోటా కిర్లోస్కర్ మోటర్ (టీకెఎం) నేడు తమ నూతన ఇన్నోవా క్రిస్టా రెండు గ్రేడ్స్ (జెడ్ఎక్స్ మరియు వీఎక్స్) ధరలను వెల్లడించింది. టయోటా కిర్లోస్కర్ మోటార్ సేల్స్, స్ట్రాటజిక్ మార్కెటింగ్ వైస్ ప్రెసిడెంట్ అతుల్ సూద్ మాట్లాడుతూ ఈ వాహనం మెరుగైన ఫ్రంట్ ఫేసిమా కలిగి ఉంటుందనీ, దీనిని కఠినమైన ధృడమైన ప్రదర్శన కోసం నిర్దిష్టమైన ప్రాధాన్యతలను దృష్టిలో ఉంచుకుని రూపొందించబడిందన్నారు. తద్వారా భారతీయ కుటుంబాలు, వ్యాపారవేత్తలు, కార్పోరేట్ అవసరాలు తీరుస్తుందని, ఎక్స్ షోరూమ్ ధరలు దేశవ్యాప్తంగా అన్ని గ్రేడ్‌లకూ వర్తిస్తాయన్నారు. ప్రీమియం కలర్స్‌కు అదనపు ధరలు వర్తిస్తాయని,తమ విభాగంలో ఈ ప్రతిష్ఠాత్మక ఎంపీవీ అగ్రగామిగా 2005లో మార్కెట్‌లో విడుదలైన నాటి నుంచి నిలువడంతో పాటుగా ఇప్పటి వరకూ ఒక మిలియన్‌కు పైగా యూనిట్లు విక్రయించబడ్డాయని చెప్పారు.

మహానాడు జయప్రదం చేయాలి

విశాలాంధ్ర - రాజానగరం : తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు జిల్లాకు వస్తున్న సందర్భంగా తెలుగుదేశం మహానాడు కార్యక్రమాన్ని జయప్రదం చెయ్యాలని మాజీ ఎమ్మెల్యే పెందుర్తి వెంకటేష్ పిలుపునిచ్చారు.మండలం లోని పరిజెల్లిపేట గ్రామంలో టీడీపీ నాయకులతో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 27,28 తేదీల్లో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో రాజమహేంద్రవరంలో మహానాడు కార్యక్రమాలు ఘనంగా జరిగేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు.మండలంలో అన్ని గ్రామాల్లోనూ పార్టీ ప్రతిష్టం చేయడానికి నాయకులందరినీ కలిసికట్టుగా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రాజమండ్రి పార్లమెంటు ఉపాధ్యక్షులు గంగిశెట్టి చంటిబాబు,మాజీ జడ్పీటీసీలు బత్తుల త్రిమూర్తులు,కొల్లంరత్నం, నాయకులు తోటకూర నాగేశ్వరరావు, మద్దిరెడ్డి చిన్న వేంకటేశ్వరరావు, చిట్టిప్రోళ్ల పద్మరాజు,ముక్కినాడ రంగరాజు,నూనె వెంకన్న,దొండపాటి లాజర్,ఖండవల్లి లక్ష్మీ,దాసరి శ్రీను, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీ బలుసులమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు

విశాలాంధ్ర - ముమ్మిడివరం : తాణేలంక గ్రామ దేవత శ్రీ శ్రీ శ్రీ బలుసులమ్మ అమ్మవారి వార్షిక జాతర మరియు తీర్థ మహోత్సవములు ఘనంగా నిర్వహించారు. అమ్మవారి కార్యక్రమంలో భాగంగా గురువారం ఆలయం వద్ద సామూహిక కుంకుమార్చన, విగ్రహం వద్ద పులిహోర కుంభంగా పోసి దానిపై రవ్వ లడ్డులు అలంకరించి అమ్మవారికి నివేదించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ రేపు తీర్థ మహోత్సవం, భారీ అన్న సమారాధన నిర్వహిస్తున్నట్లు. సాయంత్రం జరిగే జాతర మహోత్సవంలో అధిక సంఖ్యలో భక్తులు, గ్రామస్తులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

నేడు వెంకటేశ్వరా కాలేజీలో టీజర్ విడుదల

విశాలాంధ్ర - అమలాపురం : శ్రీ వెంకటేశ్వరా డిగ్రీ కళాశాలలో మూవీ ట్రీజర్ విడుదల కానున్నది. స్థానిక శ్రీ వెంకటేశ్వరా డిగ్రీ కళాశాలలో ది స్టోరీ ఆఫ్ ఎ బ్యూటీఫుల్ గర్ల్ చిత్రం శ్రీ వెంకటేశ్వరా సెమినార్ హాల్‌లో శుక్రవారం ఉదయం 10.00 గంటలకు టీజర్ విడుదల చేస్తున్నట్లు కళాశాల కరస్పాండెంట్ కెవిఆర్ఎన్ నరసింహరావు, ప్రిన్సిపాల్ కె మనోహర్, వైస్ చైర్మన్ కరాటం ప్రవీణ్, కె శ్రావణ్ దిలీప్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ హీరోలు, హీరోయిన్‌లు చిత్ర బృందం పాల్గొంటారు.

వర్షానికి దెబ్బతిన్న వరి పొలాలను పరిశీలించిన మండల అధికారులు

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : మండల వ్యవసాయ అధికారి, జగ్గంపేట ఇన్చార్జి ఎడి ఇంటి వీర గంగాధర్, ప్రత్తిపాడు తాసిల్దార్ పివివి గోపాలకృష్ణ సంయుక్తంగా వర్షానికి తడిచి ఉన్న వరి పొలాలను కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ఓమ్మంగి పరిశీలించారు. కోసి పనల మీద వరి పొలాల్లో నీరు లేనట్లయితే పొలాల్లో ఉండగానే లీటర్‌కి 50 గ్రాములు ఉప్పు ద్రావణం పిచ్చికారి చేయాలని ఏవో గంగాధర్ తెలియజేశారు. పొలాల్లో నీరు ఉన్నట్లయితే ఎత్తైన ప్రదేశానికి పనలు తరలించి ఉప్పు ద్రావణం పిచికారి చేయాలి. తడిచి పనుల మీద ఉన్న వరిని కుప్పగా వేయడానికి ఎకరానికి 25 కేజీల ఉప్పును పనల మీద జల్లుతూ కుప్ప వేయాలి. ఈ విధంగా చేయడం వల్ల మొలక మరియు ధాన్యం రంగు మారడాన్ని నివారించవచ్చని తెలియజేశారు. తడిసిన ధాన్యం కొనుగోలు కోసం రైతు భరోసా కేంద్రాల్లో సహాయకులను సంప్రదించవలసిందిగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ రెవెన్యూ అధికారులు ,గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

ఘనంగా నరసింహ జయంతి

విశాలాంధ్ర - అమలాపురం : నరసింహ జయంతి సందర్భంగా గురువారం సాయంత్రం ఐదు గంటలకు రామానుజ దాసుడు వరదా సూరిబాబు ఆధ్వర్యంలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి వైశ్య సంఘ శ్రీ వాసవి ఫంక్షన్ హాల్ నందు శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి చిత్రపటానికి పూలమాలలు వేసి పాలాభిషేకం చేశారు. అనంతరం వరదా సూరిబాబు మాట్లాడుతూ హిరణ్యకశిపుని సంహరించడానికి శ్రీహరి నరసింహ అవతారంలో అవతరించి హిరణ్యకశిపుని సంహరించారని, తన భక్తుడైన ప్రహ్లాదుని ఎన్నిహింసలకు గురిచేసినా స్వామి కాచి కాపాడారని, హిరణ్యకశిపుని సంహరించి ఉగ్రుడై ఉన్న నరసింహుని శాంతింప చేయడం ఎవరి వలనా కాదని దేవతలు గ్రహించి భక్తుడైన ప్రహ్లాదుని వల్లనే సాధ్యమని తెలుపుగా ప్రహ్లాదుడు నరసింహుని శాంతింపమని వేడుకొనగా స్వామి శాంతి రూపం ధరించినారని మనం పురాణ ఇతిహాసాలు, చలనచిత్రాల ద్వారా తెలుసుకొగలిగామని తెలిపిన ఈ కార్యక్రమంలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి వైశ్య సంఘం ముఖ్య సలహాదారు వంకాయల కాశీ, ఉత్సవ కమిటీ చైర్మన్ నందిపాటి శ్రీనివాస్, సంఘ కార్యవర్గ సభ్యులు మండవల్లి నాగేశ్వరరావు, నూలు కృష్ణ, అప్పన వీరన్న, పచ్చిగోళ్ళ రాజా, కంచర్ల అయ్యప్ప, గొల్లపూడి సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం స్వామివారికి నివేదించిన పానకాన్ని ప్రసాదంగా స్వీకరించారు.